క్లుప్తంగా

వాటర్ కూలర్ బహూకరణ


వాటర్‌కూలర్‌ను అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది

సూర్యాపేటక్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలోని ప్రజావాణి హాల్‌కు సూర్యాపేట పట్టణ బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ వారు మిని మినీ వాటర్ కూలర్‌ను బహూకరించారు. ఈ వాటర్ కూలర్‌ను ఎస్పీ రాహుల్ హెగ్డే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా, సూర్యాపేట శాఖ వారిని అభినందించారు. ఇది ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదు దారులకు, కార్యాలయానికి వచ్చే సిబ్బందికి చాలా ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, ఏఆర్ ఏఎస్పీ జనార్దన్ రెడ్డి, ఆర్ఐలు నారాయణ రాజు, నర్సింహ, బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్ ఆధ్వర్యంలో ఆకతాయిలకు కౌన్సెలింగ్

సూర్యాపేట క్రైం : జిల్లా కేంద్రంలోని విద్యానగర్, 60 ఫీట్ల రోడ్డులో షీ టీమ్ పోలీసు సిబ్బంది సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విద్యాసంస్థలు ఉన్న ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను అస్తవ్యస్తంగా నడుపుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆకతాయిలను ఆధీనంలోకి తీసుకొని షీ టీమ్ కార్యాలయంలో ఎస్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. యువత మంచి ప్రవర్తన కలిగి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇతరులను, విద్యార్థినిలను ఇబ్బందులకు గురి చేస్తే ఆకయితాలపై ఈవ్‌టీజింగ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ముదిరాజ్ ఎంప్లాయీస్ మండల అధ్యక్షుడి ఎన్నిక


నియామకపత్రం అందుకుంటున్న మనోహర్

అర్వపల్లి : ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ (మెపా) మండల అధ్యక్షుడిగా అర్వపల్లికి చెందిన సాయిని మనోహర్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మెపా జిల్లా అధ్యక్షుడు కోల కరుణాకర్‌ముదిరాజ్ సోమవారం అర్వపల్లిలో నియామకపత్రాన్ని అందజేశారు. తనను మండల అధ్యక్షుడిగా నియమించిన కరుణాకర్‌కు మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేకల రాంబాబు, వేల్పుల గణేష్, కుంభం సతీష్, కోటిప్రసాద్, కిరణ్, రాము, గణేష్, అశ్విన్, ఉపేందర్, నాని, మాధవ్, శేషు, దోని పాల్గొన్నారు.

యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు బడుగు అంజయ్య మృతికి ఆ సంఘం నాయకులు సోమవారం సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు జె.యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.అరుణభారతి, నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ, జిల్లా నాయకుడు ఎస్‌కె.సయ్యద్, మన్నె యాదగిరి, వనమాల వెంకటేశ్వర్లు, డి.బాలాజీ, లింగమూర్తి, పూర్ణాచారి తదితరులు ఉన్నారు.

సంఘబంధం అధ్యక్షురాలిగా కరుణశ్రీ



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం సంఘ బంధం -2 నూతన కమిటీని సోమవారం ఎనుకున్నారు. అధ్యక్షురాలిగా కాగితాల కరుణశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షురాలిగా వంగూరి కవిత, కార్యదర్శిగా తడకమళ్ల నాగమణి, కోశాధికారిగా నిమ్మల భవాణి, సంయుక్త కార్యదర్శిగా కుంభం విజయలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘబంధం అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు.

భువనగిరి ఎంపీ టికెట్ చెవిటి వెంకన్నకు ఇవ్వాలి

మద్దిరాల : భువనగిరి ఎంపీ టికెట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు మద్దెల భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బింగి భిక్షపతి, వల్లపు రమేష్, ఎల్లేష్, నర్సయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పట్టణ సీఐ టి.రాము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాగింగుల అంజన్‌గౌడ్, వాసవీ యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మిడి అనంత చక్రవర్తి, డాక్టర్ వంగవీటి భరత్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కుష్టు వ్యాధి సర్వే

- ఈ నెల 24 వరకు నిర్వహించనున్న ఆశా కార్యకర్తలు
- జాజిరెడ్డిగూడెం మండలంలో ఇప్పటికే 8వేల కుటుంబాల్లో సర్వే పూర్తి


కొమ్మాలలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : కుష్టువ్యాధిని పూర్తిగా నివారించడానికి వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ నెల 11 నుంచి ఇంటింటి సర్వే మొదలైంది. ఈ సర్వే 13 రోజుల పాటు జరగనుంది. ఆశా కార్యకర్తలు ప్రతిరోజు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. ఒక్కో ఆశా కార్యకర్త రోజుకు 20 కుటుంబాలను సర్వే చేయాలని అధికారులు ఆదేశించారు. అధికారుల ఆదేశానుసారం ఆశా కార్యకర్తలు మండల వ్యాప్తంగా గ్రామగ్రామాన సర్వే చేపట్టారు. వేసవి కావడంతో ఎండల దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు.

12,670 కుటుంబాలకు గాను..

జాజిరెడ్డిగూడెం మండలంలో 12,670 కుటుంబాలున్నాయి. ఇందులో ఇప్పటికే 8వేల కుటుంబాల సర్వే పూర్తయింది. ఈ సర్వేను ప్రతిరోజు మండల వైద్యాధికారి మణిదీప్, సీహెచ్‌ఓ చరణ్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 24 వరకు సర్వేను పూర్తి చేయాల్సి ఉంది.

లక్షణాలు ఇలా..

కుష్టు వ్యాధిలో ముందుగా చర్మం మొద్దుబారుతుంది. రాగిరంగు ఆకారంలో మచ్చ ఏర్పడి స్పర్శ కోల్పోవడం జరుగుతుంది. వ్యాధి ప్రభావిత ప్రదేశంలో వెంట్రుకలు పెరగకపోవడం వంటి లక్షణాలు కన్పిస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి వచ్చిన తర్వాత కనీసం ఆరు నెలల వరకు దీనిని గుర్తించలేని పరిస్థితి. ప్రత్యేకంగా పరిశీలిస్తేనే గుర్తించడం సాధ్యమవుతుంది. కుష్టు అంటువ్యాధి అయినా వేయిలో ఒక్కరికి మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది.

ఎండీటీ చికిత్స ద్వారా పూర్తిగా నయమవుతుంది



కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని ఈనెల 11న మొదలు పెట్టాం. ఈనెల 24 వరకు ఇంటింటి సర్వేను పూర్తి చేస్తాం. కుష్టు వ్యాధి నిర్ధారణ జరిగితే వారికి ఎండీటీ చికిత్స ద్వారా వైద్యం అందించి పూర్తిగా నయం చేయడం జరుగుతుంది. సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలి.

– చిలుకూరి మణిదీప్, మండల వైద్యాధికారి

సర్వేకు ప్రజలు సహకరించాలి

కుష్టువ్యాధి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని సీహెచ్‌ఓ ఎల్.చరణ్, డీపీఎంఓ సురేష్ కోరారు. సోమవారం వారు అర్వపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ నెల 24 వరకు సర్వే జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 8 వేల కుటుంబాల్లో సర్వే చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త మాగి స్వరూప పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూతనందించాలి



అనాథాశ్రమంలో బాల బాలికలతో ఎస్పీ రాహుల్ హెగ్డే

చివ్వెంల : అనాథ బాలలకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం రాత్రి చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి ఆవాసం రామ్‌కోటి తండాలోని చార్లెట్ హోం అనాథ బాలల ఆశ్రమంలో 30మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీని నిర్వాహకులు పుష్ప గుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఆశ్రమ వ్యవస్థాపకులు జాటోతు డేవిడ్‌రాజ్, రంగమ్మ, జాటోతు శేఖర్, స్నేహ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నడిగూడెం : వేణుగోపాలపురంలో సోమవారం శ్రీ గోపయ్య –తిరుపతమ్మ, అంకమ్మ, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, పంచగవ్య ప్రాసన, రుత్విగ్వరణ, జలాధివాస నీరాజన మంత్రపుష్పం, చతుర్వేదశ్వస్తి, తీర్థప్రసాద వితరణ జరిపారు. వేడుకల్లో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుక

అర్వపల్లి : వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య కూడా రాకుండా చూడాలన్నారు. పాలేరు రిజర్వాయర్‌లో నీళ్లు లేనందున మిషన్‌భగీరథ నీళ్లు గ్రామాలకు త్వరలో నిలిచిపోనున్నాయని మిషన్‌భగీరథ మండల ఏఈ అశోక్ తెలిపారు. కేవలం పదిరోజులపాటు మాత్రమే మిషన్‌భగీరథ నీళ్లు రానున్నాయని చెప్పారు. అనంతరం వివిధ శాఖలపై చర్చించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్, ఎంఈఓ బాలునాయక్, ఏపీఎం మల్లేష్, ఏపీఓ ఉపేందర్, మండల అధికారులు శ్రీకాంత్, అశోక్, మహేష్, పశువైద్యాధికారి అర్జున్, హెచ్‌డబ్ల్యూఓ రామానుజాచార్యులు, సీహెచ్‌ఓ చరణ్, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలేందర్‌రావు, ఏఈఓ సత్యం, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరు అందించి ఆదుకోవాలి

తుంగతుర్తి : సాగు నీటిని అందించి ఎండుతున్న పంటలను కాపాడాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే సాగునీరు అందించలేకపోతున్నారని అన్నారు. బోర్లలో, బావులలో నీరు అడుగంటిపోయి వరి పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాగు నీటిని అందించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎండిపోయిన పొలాలకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు సాగు నీటిని అందించి ఎండుతున్న పంట పొలాలను కాపాడాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, వైస్ఎంపీపీ శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి, రమేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట – జనగామ హైవేపై వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారి, పోలీసులు

నాగారం : ఎన్నికల కోడ్ అమలైన నేపథ్యంలో నాగారం మండల కేంద్రంలోని సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం(ఎఫ్ఎస్‌టీ) అధికారి మద్దెల ముత్తయ్య మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని సూచించారు. అంతకుమించి నగదు ఉంటే వాటికి సరైన ఆధారాలు చూపించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి నగదు, మద్యం, ఇతర వస్తువులు తరలించే ప్రయత్నం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది వెంకన్న, లింగయ్య, హరిబాబు, ఫొటోగ్రాఫర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి సంతలో హిజ్రాల హల్‌చల్

తుంగతుర్తి : తుంగతుర్తిలో హిజ్రాలు గొడవపడుతూ హల్‌చల్ సృష్టించారు. మండల కేంద్రంలో ప్రతి సోమవారం సంత జరుగుతుంది. ప్రతి సోమవారం హిజ్రాలు తుంగతుర్తికి వచ్చి వ్యాపారుల వద్ద ఎంతో కొంత డబ్బులను వసూలు చేసుకుని వెళ్తుంటారు. త్వరలో హోలీ పండుగ రాబోతుండడంతో వేర్వేరు ప్రాంతాలకు చెందిన హిజ్రాలు తుంగతుర్తికి చేరుకుని వ్యాపారస్తుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల హిజ్రాలు ఒకరిపై ఒకరు తీవ్రంగా దాడి చేసుకున్నారు. విషయం పోలీసులకు తెలియడంతో ఘర్షణ ప్రదేశానికి వచ్చి వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.


తుంగతుర్తిలో గొడవపడుతున్న హిజ్రాలు

మొదటిరోజు 'పది' పరీక్ష ప్రశాంతం



సూర్యాపేటలోని పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్న పదో తరగతి విద్యార్థులు


తిరుమలగిరిలో పరీక్ష కేంద్రం వద్ద..

సూర్యాపేటరూరల్ : మండల పరిధిలోని యండ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సూర్యాపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యండ్లపల్లిలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 137మంది విద్యార్థులు ఉండగా అందరూ పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాధికారి శైలజ తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు మండల విద్యాధికారి ఐ.శాంతయ్య తెలిపారు. 540 మంది విద్యార్థులకు 539 మంది హాజరైనట్లు తెలిపారు.

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు జి.తిరుమలగిరిలో నిర్వహిస్తున్న పదవ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జి.తిరుమలగిరి సెంటర్‌లో ముగ్గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి తెలిపారు. మండలంలో మొదటి రోజు 309 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని రెండు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు సోమవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 320 మంది విద్యార్థులకు గానూ ఇద్దరు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి, స్క్వాడ్ సలీంషరీఫ్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, సీఎస్‌లు, డీఓలు భాస్కర్, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకన్న, సిబ్బంది యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులు, రాచకొండ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చివ్వెంలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


ఆత్మకూర్(ఎస్) : నెమ్మికల్లులో..

పెన్‌పహాడ్ : పదో తరగతి పబ్లిక్ వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 325మంది విద్యార్థులకు 323 మంది హాజరైనట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. పరీక్ష కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి రాములు, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రవీందర్, ఎంపీఓ నరేష్‌లు పరిశీలించారు.

తుంగతుర్తి : తుంగతుర్తిలో సోమవారం జరిగిన 10వ తరగతి తెలుగు పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. 666 మంది విద్యార్థులకు 665 మంది పరీక్షకు హాజరయ్యారు.

ఆత్మకూర్(ఎస్) : మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నెమ్మికల్లు పీజీఎఫ్ పాఠశాల, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 357 మందికి 355 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి పి.ధారాసింగ్ తెలిపారు.

నూతనకల్ : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజయమేరి ఉన్నత పాఠశాలలో పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన 456మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు ఎంఈఓ రాములు నాయక్ తెలిపారు.


అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రం వద్ద..


తుంగతుర్తిలో పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు


పెన్‌పహాడ్ : పరీక్ష కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులు

వెంకన్న మృతి తీరని లోటు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు ఒగ్గు వెంకన్న మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. సోమవారం ఆయన మృతదేహానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చినపంగ నర్సయ్య, వీరబోయిన రవి, నాయకులు సైదులు, శంకర్, లింగయ్య తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి రూ.80వేల ఆర్థికసాయం

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన గడ్డగూటి జానయ్య, అతడి కుమారుడు విఘ్నేష్‌లు ఇటీవల టిప్పర్ ఢీకొని మృతి చెందారు. దీంతో మృతుడు జానయ్య తోటి మిత్రులైన అర్వపల్లిలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ 2000–01 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం రూ.80వేల నగదును మృతుడి కుటుంబీకులకు అందజేశారు. తమ బ్యాచ్ విద్యార్థులకు ఎవరికి ఆపద వచ్చినా వెంటనే ఆదుకుంటున్నట్లు వారు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న మృతుడి స్నేహితులు

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు


చిల్పకుంట్లలో నిరుపయోగంగా మారిన సెగ్రిగేషన్ షెడ్డు

- సేంద్రియ ఎరువు తయారీలో సిబ్బంది నిర్లక్ష్యం
- పిచ్చిమొక్కలకు ఆవాసంగా మారిన కంపోస్టు షెడ్లు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ఆయా గ్రామాల ప్రజలు

నూతనకల్ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతి పంచాయతీలో కంపోస్టు షెడ్లు నిర్మించింది. ఒక్కో షెడ్ నిర్మాణానికి సుమారు రూ.12లక్షలు వెచ్చించింది. గ్రామాల పరిశుభ్రతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదైనా కిందిస్థాయి ఉద్యోగుల అలసత్వం కారణంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని పంచాయతీల్లో షెడ్లు గ్రామానికి దూరంగా ఉండటంతో వాటిని వినియోగించడం లేదు. ప్రతి గ్రామ పంచాయతీకి చెత్తసేకరణ కోసం ట్రాక్టర్‌లను సమకూర్చినప్పటికీ చెత్త సేకరణ నిత్యం జరగకపోవడంతో ప్రజలు ఖాళీ స్థలాల్లోనే చెత్తను పడేస్తున్నారు. వర్షాకాలంలో చెత్త తడిసి దుర్గంధం వెదజల్లుతోంది.

తయారు కాని ఎరువు..

మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ట్రాక్టర్లతో పాటు నీళ్ల ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించడం కోసం ప్రజలకు బుట్టలు పంపిణీ చేసింది. వీటిని ప్రజలు కూడా సక్రమంగా వినియోగించకుండా ఇష్టానుసారంగా చెత్తను అందిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది కంపోస్టు షెడ్లలో ఎరువు తయారు చేసి.. తయారైన ఎరువును గ్రామ పంచాయతీల్లో విక్రయించి ఆదాయాన్ని పెంచుకోవాలనేది ప్రభుత్వ ఉద్దేశం. కానీ గ్రామాల్లో ఎరువులు తయారు చేస్తున్న దాఖలాలే లేవు. కంపోస్టు షెడ్లు పిచ్చిమొక్కలు మొలిచి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

వృథాగా నిర్మాణాలు..

సేంద్రియ ఎరువు తయారు చేసేలా కంపోస్టు షెడ్లను బ్లాక్‌ల వారీగా నిర్మించారు. వీటిలో చాలా వరకు చెత్త నిల్వ చేసి సేంద్రియ ఎరువుగా మారుస్తారు. కానీ అవి గ్రామాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మారాయి. సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశాన వాటికలు దాదాపు ఒకే ప్రాంతంలో నిర్మించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చి సేంద్రియ ఎరువుల తయారీకి కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం

కంపోస్టు షెడ్లను వెంటనే వినియోగంలోకి తీసుకువస్తాం. గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తాం. సేంద్రియ ఎరువుల తయారీకి చర్యలు చేపడతాం.

– సునీత, ఎంపీడీఓ

నకిలీ విత్తనాల ఫిర్యాదుపై పంట పరిశీలన


వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ దివ్య

ఆత్మకూర్(ఎస్) : కందగట్లలోని వరి పొలాలను మండల వ్యవసాయ అధికారిణి దివ్య సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు ఏర్పుల సైదులు తనను ప్రైవేటు వ్యాపారులు నకిలీ విత్తనాలతో మోసం చేశారని ఫిర్యాదు చేయగా ఆమె సదరు రైతు పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పొలంలో కొన్ని కంకులు ఏర్పడగా, మరికొన్ని కంకులు లేటుగా వస్తున్నాయని, వేసిన వరిలో రెండు రకాలు కలిసినట్లు అనుమానిస్తున్నామని తెలిపారు. పరిశీలన నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు మేతగా వరిచేలు


ఎండలు తీవ్రం కావడం, సాగునీరు అందకపోవడంతో రామన్నగూడెం శివారులో ఎండిపోయిన ఓ వరి పొలంలో మేస్తున్న జీవాలు